అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 340 | వరంగల్ | శుక్రవారం, 23 అక్టోబర్ 2026 | పేజీలు: 08





నిరవధిక పోరు

11 రోజులుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె.. సర్కారులో చలనం ఏదీ?

నిరసనలో 17,541 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

టీకా కార్యక్రమం బంద్.. తల్లీబిడ్డల సేవలకు విఘాతం

ఎన్‌సీడీ సేవలు నిలిచిపోవడంతో రోగులకు తప్పని తిప్పలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన జేఏసీ నేతలు

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలకు వైద్య సేవలందిస్తూ.. వ్యాధుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు నేడు తమ హక్కుల కోసం రోడ్డెక్కారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కరువైంది.. వేతనాల విషయంలోనూ అన్యాయం జరుగుతోందన్న ఆవేదనతో 17,541 మంది ఉద్యోగులు నిరవధిక సమ్మె బాట పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 11 రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నా.. వారి సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు. మరోవైపు, సమ్మె ప్రభావం ప్రజారోగ్య సేవలపై పడుతోంది. టీకా కార్యక్రమాలు నిలిచిపోగా.. గర్భిణులు, బాలింతలకు అందాల్సిన ఏఎన్‌సీ, పీఎన్‌సీ సేవలకు విఘాతం కలిగింది. అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) సేవలూ నిలిచిపోవడంతో సంబంధిత రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ఉద్యోగులే తమ భవిష్యత్తు కోసం పోరాడాల్సిన దుస్థితి నెలకొంది. సమస్యల పరిష్కారం కోసం జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (ఎన్‌హెచ్‌ఎం జేఏసీ) నేతలు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. *- అక్షరశక్తి, వరంగల్/హైదరాబాద్*



5

మళ్లీ కేసీఆర్ రావడం ఖాయం!

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేద్దామా అని ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. *- అక్షరశక్తి, హైదరాబాద్,*



- కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రజలంతా బీఆర్ఎస్ వైపే..
- రాష్ట్రంలో కరెంటు, తాగునీటి కష్టాలకు కాంగ్రెస్ పాలనే కారణం
- కాళేశ్వరం పంపులు నడిపితే కేసీఆర్‌కు పేరొస్తుందని కుట్ర
- కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి
- పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


4

నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కలకలం...

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ..

భూముల మ్యుటేషన్‌కు యత్నం

ఖిలా వరంగల్ మండలంలో నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వ్యవహారం తాజాగా వెలుగుచూసింది. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతోపాటు ప్రభుత్వ కార్యాలయ సీలును దుర్వినియోగం చేసి నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. *- అక్షరశక్తి, వరంగల్*



6

శ్రీరామ్ సేన ప్రారంభం


- సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు యువత కదలాలి
- శ్రీరామ్ సేన తెలంగాణ అధ్యక్షుడు నాగపురి వెంకటేష్ గౌడ్



అక్షరశక్తి,వరంగల్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్‌లోని ఓరుగల్లు భద్రకాళి దేవాలయంలో శ్రీరామ్ సేన తెలంగాణ సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ పేరు, చిహ్నం, జెండా, కండువాలకు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు నాగపురి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం తెలంగాణలోని యువత శ్రీరామ్ సేనలో చేరాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు, హిందూ మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంస్థను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి, వివిధ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ సేన సభ్యులు పత్రిక్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్





అక్షరశక్తి, హైదరాబాద్: నగర ప్రజలకు ప్రకృతిని, పక్షుల జీవనశైలిని దగ్గరగా పరిచయం చేసేందుకు డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25న ఆదివారం హైదరాబాద్‌లోని బొటానికల్ గార్డెన్‌లో పక్షుల పరిశీలన కార్యక్రమం నిర్వహించనున్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం ఉదయం 6 గంటల నుంచి 9.30 గంటల వరకు కొనసాగుతుంది. పక్షులను ఇష్టపడేవారు, వాటి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఇందులో పాల్గొనవచ్చు. ప్రకృతి ఒడిలో ఉదయపు వేళలను గడుపుతూ వివిధ పక్షులను పరిశీలించే అవకాశం కల్పించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనేవారు నడకకు అనువైన బూట్లు, సౌకర్యవంతమైన దుస్తులు ధరించి, నీళ్ల సీసా వెంట తెచ్చుకోవాలని నిర్వాహకులు సూచించారు. అందుబాటులో ఉన్నవారు పక్షులను స్పష్టంగా పరిశీలించేందుకు దూరదర్శిని లేదా కెమెరాను తీసుకురావచ్చు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒక్కొక్కరికి రూ.450 రుసుము నిర్ణయించారు. ఇందులో అల్పాహారం కూడా ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు ముందస్తు నమోదు, ఇతర వివరాల కోసం 98852 98980 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

బిసిని సీఎం చెయ్యడమే జనసేన లక్ష్యం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్యే అభ్యర్థి గడల శ్రీనివాస్ రావు



అక్షరశక్తి, హన్మకొండ : హన్మకొండ నయమ్ నగర్ బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో జనసేన పార్టీ నుండి వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గా పోటీ చేస్తున్న డా. గడల శ్రీనివాస్ రావు బిసి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌ను కలసి ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్యే ఎలక్షన్స్ లో బిసిలు జనసేన పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రధాన పార్టీలు అన్ని అగ్రవర్ణాలకు టికెట్ లు కేటాయిస్తున్నాయి అని, జనాభాలో 60% ఉన్న బిసి ల పట్ల అన్ని రాజకీయ పార్టీ లు చిన్న చూపు చూస్తున్నట్లు అని అభిప్రాయ పడ్డారు. నీను ఒక బిసి బిడ్డగా మీ ముందుకు వస్తున్న నన్ను ఆశీర్వదించాలని కోరారు. తదనంతరం వడ్లకోండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ మా నాయకుడు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అభిప్రాయం ప్రకారం వరంగల్ ఉమ్మడి జిల్లా బిసి సంక్షేమ సంఘం నిర్ణయం ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు కరేట ప్రభాకర్ గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధం పద్మజ దేవి, బిసి సంక్షేమ సంఘం నాయకులు గడ్డం రాజు, సాంబశివుడు, నరేష్ యాదవ్, సమ్మయ్య, సుమన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలి





రామప్పలో 12 రోజుల ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం

అక్షరశక్తి,ములుగు: చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై యువత అవగాహన పెంచుకొని, వాటి ప్రాధాన్యాన్ని ఇతరులకు తెలియజేయాలని సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ పర్యాటక శాఖ సౌజన్యంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్పలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం-2026 కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 35 మంది స్వచ్ఛంద సేవకులు ఈ 12 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, భూగర్భ శాస్త్రం వంటి పలు అంశాలను తెలుసుకునేందుకు ఈ శిబిరం విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. చారిత్రక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేస్తూ, వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ మాట్లాడుతూ, శిబిరం నిర్వహణకు పర్యాటక శాఖ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. పర్యాటక పోలీసుల ద్వారా భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. రామప్పకు ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించినప్పటి నుంచి వరుసగా ఐదో ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రామప్పకు గుర్తింపు సాధించడంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేసిన కృషి, పోషించిన పాత్రను కార్యక్రమంలో వివరించారు. శిబిరంలో కల్పించే సౌకర్యాలు, విద్యార్థులు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిర సమన్వయకర్త శ్రీధర్ రావు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ పరిరక్షణ సహాయకుడు భార్గవ్, ప్రదీప్ బాబు, పర్యాటక శాఖ సహాయ పర్యాటక ప్రోత్సాహక అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, ఆలయ పూజారులు హరీష్ శర్మ, ఉమాశంకర్,, పర్యాటక మార్గదర్శకులు గోరంటల విజయ్ కుమార్, పర్యాటక శాఖ పోలిసులు, శ్రీనివాస్, శ్రీకాంత్, దశరథ్, పర్యాటక సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, పురావస్తు శాఖ సిబ్బంది, , వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ రద్దు చేయాలి

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి
- వరంగల్ కాశిబుగ్గలో రైతు సంఘాల నిరసన.. చిత్రపటాల దహనం



అక్షరశక్తి, వరంగల్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు శుక్రవారం వరంగల్‌లోని కాశిబుగ్గ సెంటర్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానేశ్‌కుమార్ చిత్రపటాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించాలని, ఓటు హక్కును పరిరక్షించాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న ఉద్యమకారులపై నిర్బంధ చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 13.5 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని, తెలంగాణలోనూ సుమారు 80 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని నాయకులు ఆరోపించారు. ఈ సంఖ్యలకు సంబంధించి అధికారిక నిర్ధారణను వారు సమర్పించలేదు. అర్హులైన పౌరులు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయకపోతే విద్యార్థులు, యువకులు, రైతులు, ప్రజాసంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్, ఏఐయూకేఎస్, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శులు రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, చుక్క మొగిలి, కిసాన్ సంఘటన, ఏఐకేఎస్ఎస్ బాధ్యులు సుధామల్ల భాస్కర్, వల్లందాస్ కుమార్, ఎస్‌కేఎం నాయకులు సింగతి సాంబయ్య, జక్కుల తిరుపతి, మైదంపాని, బండి వెంకటేశ్వర్లు, ఐతం నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎన్‌జీ గ్యాస్ అందించేందుకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



అక్షరశక్తి, హన్మకొండ : హనుమకొండ పట్టణంలో ప్రజల సౌకర్యార్థం అందించనున్న పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ గ్యాస్) అందించేందుకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత శాఖల అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ పట్టణంలో ప్రజల సౌకర్యార్థం పైప్డ్ నేచురల్ గ్యాస్ పీఎన్జీ ఏర్పాటుకు మేఘా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ, ఐవో సీఎల్, హెచ్పీసీఎల్ సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మేఘా సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో పైప్డ్ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ నిర్మాణం, సరఫరా కు సంబంధించిన వివిధ శాఖల అనుమతులు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ పైపు లైన్ ఏర్పాటులో వివిధ శాఖల వద్ద పెండింగ్ లో ఉన్న పర్మిషన్లు త్వరగా వచ్చేటట్టు చర్యలు చేపట్టాలన్నారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ ప్రజలకు త్వరగా అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులు సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, హనుమకొండ ఏసిపి నరసింహారావు, ఎన్ హెచ్ ఎ ఐ అధికారి లింగయ్య, ఆర్ అండ్ బి ఈఈ దేవిక చౌహన్, డీపీవో లక్ష్మీ రమాకాంత్, విద్యుత్ శాఖ ఏడిఈ గంగారెడ్డి, మేఘా మేఘా సంస్థ ప్రతినిధులు హరి, ఎస్కే రషీద్, ఐఓసీఎల్ హెచ్పీసీఎల్ సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకులకు అన్యాయం జరగొద్దు

- 49 పోస్టుల భర్తీలో ప్రస్తుత అధ్యాపకులు డిస్టర్బ్ కాకూడదు
- రూ.50 వేల రెమ్యునరేషన్, 12 సెలవులు అమలు చేయాలి
- వీసీ, రిజిస్ట్రార్‌కు కేయూపీఎల్‌ప నూతన కమిటీ వినతి





అక్షరశక్తి, కేయూ క్యాంపస్(వరంగల్): కాకతీయ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్స్ అసోసియేషన్ (కేయూపీఎల్ఏ) నూతన కమిటీ వీసీ, రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. తమ డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్లగా, తమ పరిధిలోని అంశాలను పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

నియామకాల్లో ప్రస్తుత అధ్యాపకులకు రక్షణ కల్పించాలి

విశ్వవిద్యాలయంలో నోటిఫికేషన్ ఇచ్చిన 49 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ ప్రక్రియలో ఒక్క పార్ట్‌టైం అధ్యాపకుడూ డిస్టర్బ్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిటీ కోరింది. పార్ట్‌టైం అధ్యాపకుల పోస్టులను మినహాయించి మిగిలిన ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసింది. పార్ట్‌టైం అధ్యాపకులకు రూ.50 వేల రెమ్యునరేషన్ ఇస్తామని గతంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఈ అంశాన్ని రానున్న ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి మరోసారి ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు 12 సెలవులు అమలు చేస్తూ వెంటనే సర్కులర్ జారీ చేయాలని డిమాండ్ చేసింది. పూర్తి వర్క్‌లోడ్ ఉన్నవారైనా, తక్కువ వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్నవారైనా పని తగ్గిన సమయంలో అవుట్‌రీచ్ కార్యక్రమాల ద్వారా ఆ పీరియడ్లను భర్తీ చేసేలా హెచ్ఓడీలకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

రెమ్యునరేషన్ పెంచాలని వినతి

సైన్స్ విభాగాల్లో ప్రాక్టికల్ తరగతులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రెమ్యునరేషన్‌ను రూ.350 నుంచి రూ.700కు పెంచాలని, రెండు ప్రాక్టికల్స్‌ను ఒక గంటగా పరిగణించి చెల్లింపులు చేయాలని కోరింది. 'పార్ట్‌టైం లెక్చరర్' అనే పదాన్ని తొలగించి 'అసిస్టెంట్ ప్రొఫెసర్ (పార్ట్‌టైం)' అనే హోదాను అమలు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో పార్ట్‌టైం సేవలకు రాటిఫికేషన్, వెయిటేజీ కల్పించాలని డిమాండ్ చేసింది. డిమాండ్లపై వీసీ, రిజిస్ట్రార్‌లు సానుకూలంగా స్పందించి తమ పరిధిలోని అంశాలను త్వరలో అమలు చేస్తామని చెప్పినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్లు డాక్టర్ ఓ. మోహన్, డాక్టర్ ఎం. కృష్ణసుమంత్, అధ్యక్షుడు డాక్టర్ కె. రాజేందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. వాణిదేవి, కన్వీనర్ డాక్టర్ టీ. భాగ్యమ్మ, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి. జోత్స్న, డాక్టర్ ఆర్. శ్యాంసుందరాచారి, డాక్టర్ బి. సుధీర్, డాక్టర్ కె. ప్రసన్న, డాక్టర్ బి. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డాక్టర్ బి. రామ్‌మోహన్, డాక్టర్ ఆర్. కళ్యాణి, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ ఎస్. సాహితి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరుపై విద్యార్థులకు అవగాహన

భూపాలపల్లిలో పోలీస్ ఫ్లాగ్ డే ఓపెన్ హౌస్

అక్షరశక్తి, భూపాలపల్లి, అక్టోబరు 23: పోలీస్ శాఖ విధులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల రక్షణకు వినియోగించే పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసు శాఖ విధులు, ఆయుధాల వినియోగం, సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్‌ప్రింట్ వ్యవస్థ, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ పనితీరును అధికారులు వివరించారు. ఏకే47, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 9 ఎంఎం పిస్టల్ తదితర ఆయుధాలను ప్రదర్శించి వాటి గురించి అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే విధానం, దర్యాప్తు ప్రక్రియ, అత్యవసర సమయాల్లో డయల్ 112 ద్వారా పొందగలిగే సేవలను వివరించారు. సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. సాంకేతిక పరికరాల పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. వారి ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరాల బారినపడితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పోలీస్ సహాయం కోసం 112ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కేయూలో అభివృద్ధి పనులను ప్రారంభించిన వీసీ

అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా పరీక్షల విభాగంలో రూ.167 లక్షల వ్యయంతో నిర్మించిన బ్లాక్-2 నూతన భవనాన్ని, స్పోర్ట్స్ హాస్టల్ నుంచి ఇంజినీరింగ్ కళాశాల (కోఎడ్యుకేషన్) వరకు రూ.134 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి ఆచార్య వై. వెంకయ్య మాట్లాడుతూ, పరీక్షల విభాగంలో నూతన భవన నిర్మాణంతో మూల్యాంకన ప్రక్రియకు సంబంధించిన సదుపాయాలు మెరుగుపడటంతో పాటు, ఎదురవుతున్న ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ పబ్లికేషన్ సెల్, స్టోర్స్ విభాగాలకు అవసరమైన అదనపు స్థల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. స్పోర్ట్స్ హాస్టల్ నుంచి ఇంజినీరింగ్ కళాశాల (కోఎడ్యుకేషన్) వరకు నిర్మించిన సీసీ రోడ్డు వల్ల క్యాంపస్‌లో రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఎదుర్కొనే రవాణా ఇబ్బందులు తగ్గుతాయని ఆచార్య వెంకయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ రమ, డాక్టర్ సుదర్శన్, కే. అనితా రెడ్డి, ఆచార్య కే. రాజేందర్, ఆచార్య ఎన్. రమణ, అదనపు పరిక్షల నియంత్రణ అధికారులు, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది, ఇంజనీరింగ్ కాలేజీ సిబ్బంది తదితరులతో పాటు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆల్ ఇన్ వన్(ALL IN ONE)పుస్తకాల పంపిణీ

- కొండా మురళీధర్ రావు పుట్టినరోజు సందర్భంగా పుస్తకాల పంపిణీ
- శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు
- సుమారు రూ.25 వేల రూపాయల విలువైన పుస్తకాల అందజేసిన శ్రీరాం రాజేష్



అక్షరశక్తి, వరంగల్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పుట్టినరోజును పురస్కరించుకొని శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు చదువులో ఉపయోగపడే ఆల్ ఇన్ వన్ పుస్తకాలను కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్ అందజేశారు. సుమారు 25 వేల రూపాయల విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నవీన్ రాజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ మొదటగా మా నాయకుడు మురళీధర్ రావుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను.మా బాస్ పుట్టినరోజు సందర్భంగా ఏదైనా మంచి కార్యక్రమం చేయాలనుకున్నప్పుడు మా అన్న నవీన్ రాజు ఇచ్చిన సలహా మీద బుక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులో అవసరమైన సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ లక్ష్యంతో చదివి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్ర స్వామి,జిల్లా కాంగ్రెస్ నాయకులు రేణుకుంట్ల శివ కుమార్,బత్తుల నవీన్ కుమార్,బుక్కరాజు మాధవి,జావిద్, నాగరాజు,సంతోష్,భాస్కర్,రాంప్రసాద్,అపర్ణ,ప్రియదర్శిని,శ్రీలత,పాఠశాల ఉపాధ్యాయులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి

రత్నగిరిలో కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



అక్షరశక్తి, భీమదేవరపల్లి, అక్టోబరు 23: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చేపట్టిన రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సర్వేయర్లను ఆదేశించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ సాంకేతికత ద్వారా భూములను కొలుస్తున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్.. ఇప్పటివరకు ఎన్ని ఎకరాల్లో సర్వే పూర్తయింది, ఇంకా ఎంత భూమి సర్వే చేయాల్సి ఉందని భూముల కొలతల శాఖ ఏడీ నూర్‌సింగ్, సర్వేయర్ విజయభాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో పక్క భూముల రైతులు అక్కడే ఉంటున్నారా, రైతులు తమ భూముల హద్దులను చూపిస్తున్నారా అని ఆరా తీశారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వే ప్రక్రియ దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు స్థానిక రైతులు సహకరించాలని సూచించారు.

పంటల సాగు, విద్యుత్ సరఫరాపై ఆరా

గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను కలెక్టర్ పరిశీలించారు. ఏయే పంటలు సాగు చేశారు, ప్రస్తుతం పంటలు ఏ దశలో ఉన్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి రోజుకు ఎన్ని గంటల విద్యుత్ సరఫరా అవుతోందని ఏఈఈ లక్ష్మణ్ నాయక్‌ను ప్రశ్నించారు. సబ్‌స్టేషన్ పనులు, విద్యుత్ మరమ్మతులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో ఏ పంటలు సాగు చేయనున్నారని రైతులు, ఏఈఓ నాగరాజును అడగగా జొన్న పంట సాగు చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ తిరుమల, నాయబ్ తహసీల్దార్ సూర్య, సంబంధిత అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో గూడూరు మండలానికి సముచిత స్థానం



అక్షరశక్తి, గూడూరు: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ రాష్ట్ర ఆరవ కౌన్సిల్ సమావేశాలు అక్టోబర్ 14, 15 తేదీలలో నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగాయి. ఈ సమావేశాల్లో భాగంగా జరిగిన రాష్ట్ర శాఖ నూతన కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా సుంకరి భిక్షం గౌడ్ , ప్రధాన కార్యదర్శిగా బట్టాపురం మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఈ నూతన రాష్ట్ర కార్యవర్గంలో గూడూరు మండలానికి చెందిన ఎనిమిది మంది ఉపాధ్యాయులకు వివిధ హోదాలలో కీలక పదవులు దక్కాయి.

గూడూరు మండలం నుండి రాష్ట్ర శాఖకు..

- ఆర్. లక్షపతి - రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు,
- టి. నమ్మళ్వార్ - రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు,
- చింత బాలయ్య - రాష్ట్ర ఉపాధ్యక్షులు,
- దిడ్డి అనిల్ కుమార్ - రాష్ట్ర ఉపాధ్యక్షులు,
- ఆర్. జయశ్రీ - రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు,
- ఊక లక్ష్మయ్య - రాష్ట్ర కార్యదర్శి
- పెనుక విజయ్ కుమార్ - రాష్ట్ర కార్యదర్శి,

పోలేపల్లి సునీత - రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ ఎన్నికకు అన్ని విధాలా సహకరించిన పి ఆర్ టి యు టిఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మిరియాల సతీష్ రెడ్డి కి ప్రధాన కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్ కి పీఆర్‌టీయూటీఎస్ గూడూరు మండల అధ్యక్షులు మండల వెంకటేశ్వర్లు కి, ప్రధాన కార్యదర్శి సోనబోయిన రవిచంద్ర కి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల పదోన్నతుల సమస్య పరిష్కరించాలి

- మెరిట్-కమ్-సీనియారిటీ విధానంతో నష్టం జరుగుతోందని వినతి
- సీఎండీలతో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ

అక్షరశక్తి, హైదరాబాద్: విద్యుత్ శాఖలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సీనియారిటీ, పదోన్నతి ప్రయోజనాలకు సంబంధించిన మెరిట్‌కమ్‌సీనియారిటీ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ అరేపల్లి మోహన్ నాయకత్వంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగతో కలిసి నాయకులు మంత్రిని కలిశారు. మెరిట్‌కమ్‌సీనియారిటీ విధానం అమలుతో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సీనియారిటీ, పదోన్నతి ప్రయోజనాలకు నష్టం కలుగుతోందని వివరించారు. ఈ విధానానికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) లేదా సాధారణ పరిపాలనా శాఖ (జీఏడీ) మార్గదర్శకాల్లో ఆధారం లేదని పేర్కొంటూ ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని కోరారు. వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించి టీజేఎన్‌పీడీసీఎల్ సీఎండీతో మాట్లాడినట్లు అసోసియేషన్ తెలిపింది. విద్యుత్ సంస్థల సీఎండీలు, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సాధారణ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అరేపల్లి శ్రీనివాస్, కె. ఉపేందర్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన మంత్రికి అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.



మళ్లీ కేసీఆర్ రావడం ఖాయం!





- కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రజలంతా బీఆర్ఎస్ వైపే..
- రాష్ట్రంలో కరెంటు, తాగునీటి కష్టాలకు కాంగ్రెస్ పాలనే కారణం
- కాళేశ్వరం పంపులు నడిపితే కేసీఆర్‌కు పేరొస్తుందని కుట్ర
- కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి
- పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అక్షరశక్తి, హైదరాబాద్, అక్టోబరు 23 : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేద్దామా అని ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. మరో ఏడాది రేవంత్‌రెడ్డి హడావుడి ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణలో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదని గుర్తుచేశారు. అడ్డమైన మాటలు, తప్పుడు ప్రచారంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటికి తీవ్ర కష్టాలు ఎదురవుతున్నాయని, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై కుట్ర చేశారు

ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే పరిస్థితులపై పది నెలల ముందే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కేటీఆర్ విమర్శించారు. పొరుగు రాష్ట్రాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రాజెక్టులను నింపుకుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కాళేశ్వరం పంపులు ప్రారంభిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే వాటిని నడపకుండా కుట్ర చేశారని ఆరోపించారు. మేడిగడ్డ కూలిపోయిందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని, రాహుల్‌గాంధీని తీసుకొచ్చి అబద్ధాలు చెప్పించారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మరని అన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే!

తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి కంటే రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై విమర్శల విషయంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటవుతున్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణలో లూటీ పాలన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రజలంతా తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు.

దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకం

తెలంగాణతోపాటు దేశ రాజకీయాల్లోనూ కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరపడ్డాయని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీయేతర రాజకీయ శక్తులు దేశంలో బలపడాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్ల క్రితమే కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి గురించి మాట్లాడారని, అప్పట్లో చాలామందికి దాని ప్రాధాన్యం అర్థం కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం బీజేపీ పాలన, కాంగ్రెస్ వైఫల్యాలను చూస్తుంటే కేసీఆర్ చెప్పిన మాటల్లోని వాస్తవం ప్రజలకు అర్థమవుతోందన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ బలపడలేకపోతోందని విమర్శించారు. బీజేపీ గత పదేళ్లలో ఎన్నడూ లేనంత బలహీనంగా మారిందని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకులను బెదిరించగలిగినా యువతను భయపెట్టడం బీజేపీకి సాధ్యం కాదన్నారు.

స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ భయపడుతోంది

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ భారీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2017లో కార్పొరేషన్ ఎన్నికల్లో సాధించిన విజయాల తరహాలోనే మరోసారి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని సూచించారు.

పట్టభద్రుల ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ధనబలాన్ని మాత్రమే నమ్ముకుందని విమర్శించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ మోసాలను గుర్తించిన పట్టభద్రులు, విద్యార్థులు, నిరుద్యోగులు రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని కేటీఆర్ స్పష్టం చేశారు.

వరంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ

- రూ.382 కోట్లతో ఐదు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన కుడా చైర్‌పర్సన్

అక్షరశక్తి, వరంగల్ : హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా, నగర అభివృద్ధికి రూ.382 కోట్ల అంచనా వ్యయంతో ఐదు కీలక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు కుడాకు మంజూరు చేయడం పట్ల కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కుడా, వరంగల్ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

వరంగల్ చారిత్రక వైభవాన్ని కాపాడుతూ, ఆధునిక మౌలిక సదుపాయాలతో నగరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ అనుమతులు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. కుడా ఆధ్వర్యంలో వరంగల్ కోట కందకాల పునరుద్ధరణ, హనుమకొండ సెంట్రల్





ప్లాజా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ కమ్ కమర్షియల్ కాంప్లెక్స్, వేయి స్తంభాల గుడి పరిసరాల్లో అభివృద్ధి పనులు, మ్యూజికల్ గార్డెన్ ఏర్పాటు వంటి ప్రాజెక్టులు నగరానికి కొత్త రూపురేఖలను తీసుకురానున్నాయని తెలిపారు. వీటితో పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా, వాణిజ్య కార్యకలాపాలు, స్థానిక ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం వల్ల నగర అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా సాధించగలమని పేర్కొన్నారు. "వరంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చూపుతున్న ప్రత్యేక చొరవ నగర ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోంది. నగరానికి ఇచ్చిన హామీకి అనుగుణంగా కీలక ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయడం పట్ల వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్టులు సాకారమై వరంగల్ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూ, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన నగరంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి తెలిపారు.



నిరవధిక పోరు

11 రోజులుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె.. సర్కారులో చలనం ఏదీ?

నిరసనలో 17,541 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

టీకా కార్యక్రమం బంద్.. తల్లీబిడ్డల సేవలకు విఘాతం

ఎన్‌సీడీ సేవలు నిలిచిపోవడంతో రోగులకు తప్పని తిప్పలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన జేఏసీ నేతలు

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలకు వైద్య సేవలందిస్తూ.. వ్యాధుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు నేడు తమ హక్కుల కోసం రోడ్డెక్కారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కరువైంది.. వేతనాల విషయంలోనూ అన్యాయం జరుగుతోందన్న ఆవేదనతో 17,541 మంది ఉద్యోగులు నిరవధిక సమ్మె బాట పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 11 రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నా.. వారి సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు. మరోవైపు, సమ్మె ప్రభావం ప్రజారోగ్య సేవలపై పడుతోంది. టీకా కార్యక్రమాలు నిలిచిపోగా.. గర్భిణులు, బాలింతలకు అందాల్సిన ఏఎన్‌సీ, పీఎన్‌సీ సేవలకు విఘాతం కలిగింది. అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) సేవలూ నిలిచిపోవడంతో సంబంధిత రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ఉద్యోగులే తమ భవిష్యత్తు కోసం పోరాడాల్సిన దుస్థితి నెలకొంది. సమస్యల పరిష్కారం కోసం జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (ఎన్‌హెచ్‌ఎం జేఏసీ) నేతలు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. - అక్షరశక్తి, వరంగల్/హైదరాబాద్

హక్కుల కోసం అలుపెరగని పోరు

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. ఏఐటీయూసీ, సీపీఐ, బీజేపీ, బీఆర్ఎస్, తెలంగాణ రక్షణ సేన, జనసేన తదితర పార్టీల నాయకులు ఉద్యోగుల డిమాండ్లకు సంఘీభావం ప్రకటించారు. వరంగల్‌లోని పోచమ్మమైదాన్ కూడలిలో, హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదని, న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



సేవలు నిలిచిపోయి.. రోగులకు ఇక్కట్లు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె ప్రభావం క్షేత్రస్థాయి వైద్య సేవలపై తీవ్రంగా పడుతోంది. టీకా కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడటంతో పిల్లలకు నిర్దిష్ట సమయంలో టీకాలు వేయించాల్సిన తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గర్భిణులకు అందాల్సిన యాంటీనేటల్ కేర్ (ఏఎన్‌సీ), ప్రసవానంతర సంరక్షణ (పీఎన్‌సీ) సేవలు నిలిచిపోవడం తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణపై ప్రభావం చూపుతోంది. మధుమేహం, రక్తపోటు వంటి అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, పర్యవేక్షణకు సంబంధించిన ఎన్‌సీడీ సేవలకూ ఆటంకం ఏర్పడింది. ప్రభుత్వ వైద్య వ్యవస్థలో కీలకమైన సేవలు అందించే సిబ్బంది సమ్మెలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కరించి, వైద్య సేవలను సాధారణ స్థితికి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సమస్యలకు పరిష్కారం దొరికేనా?

సమ్మె ప్రారంభమైనప్పటి నుంచి తమ డిమాండ్ల పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీ క్రిస్టినాను కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. అన్ని క్యాడర్ల ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, 100 శాతం గ్రాస్ శాలరీ, వేతనాల పెంపు తదితర అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సమస్యలపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. అయితే, డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ, కార్యాచరణ వెలువడాల్సి ఉంది. ఉప ముఖ్యమంత్రి, ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీతో జరిగిన సమావేశంలోనూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేందర్ రావు పుట్ట, డాక్టర్ టి. భరత్, ఎండీ రుక్ముద్దీన్, బి. శ్రీనివాస్, శంకర్, సాయికృష్ణ, ఏఎన్ఎంల ప్రతినిధులు, బాబు తదితరులు పాల్గొన్నారు.





ఇవీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ డిమాండ్ చేస్తోంది. రెగ్యులరైజేషన్ జరిగే వరకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని కోరుతోంది. ఉద్యోగులకు హెల్త్ కార్డులు, ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తోంది. 2018 నుంచి వేతనాల పెంపులో జరిగిన నష్టాలను సరిదిద్దేందుకు కొత్త జీవో విడుదల చేయాలని, సంవత్సరానికి 35 క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఐదు శాతం వేతన పెంపును అమలు చేయాలని, విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే ఆరు నెలల్లోగా కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని కోరుతోంది. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఎంపికైన ఏఎన్ఎంలకు నియామక ఉత్తర్వులు జారీ చేయాలని, 1195 జీవో ప్రకారం 16 నెలల కిందట పెరిగిన వేతనాల బకాయిలను విడుదల చేయాలని జేఏసీ పట్టుబడుతోంది.

ఉద్యోగుల సేవలకు గుర్తింపు ఏదీ?

ప్రజారోగ్య వ్యవస్థలో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు.. తమ సేవలకు తగిన గుర్తింపు, కనీస ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాల్సిన బాధ్యత తమపై ఉన్నప్పటికీ, తమ కుటుంబాల భవిష్యత్తుపై భరోసా లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా వదిలేయడం వల్ల ఉద్యోగులే కాకుండా వారిపై ఆధారపడిన ప్రజారోగ్య సేవలూ ప్రభావితమవుతున్నాయని జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.









జేఏసీ నేతల ఆధ్వర్యంలో సమ్మె

ఎన్‌హెచ్‌ఎం జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పుట్ట మహేందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ. భరత్‌కుమార్, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా, జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రుక్ముద్దీన్, అధికార ప్రతినిధి బి. శ్రీనివాస్, నేతలు మొగిలి నరేష్, టి సుమన్, వినోద్, మహిళా ప్రెసిడెంట్ డాక్టర్ హరిప్రియ, అంజియాదవ్, వేణు, సతీష్‌కుమార్, బండి రాజేష్, కోర్నేలు, శ్రీనివాస్‌బాబు, తదితరుల ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని జేఏసీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సర్వపిండి పే చర్చ..

తెలంగాణ సంప్రదాయ వంటకంతో ప్రజల్లోకి..



అక్షరశక్తి, వరంగల్: పట్టభద్రుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ సంప్రదాయ వంటకమైన సర్వపిండిని వేదికగా చేసుకొని 'సర్వపిండి పే చర్చ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన 'చాయ్ పే చర్చ' తరహాలో సర్వపిండి పే చర్చ ద్వారా ప్రజలకు చేరువ కావాలన్నది తన ఉద్దేశమని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విద్యారంగ సమస్యలు, రాజకీయ అంశాలపై వివిధ రంగాల ప్రముఖులతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాక శ్రీధర్, చింతం రాజేశ్వర్, జంగిలి దేవరాజు, మట్ట దుర్గాప్రసాద్, చింతల అనిల్, గోసుల ఆనంద్, తిరుపతి నాయక్, బోడకుంట్ల రవికుమార్, కెత్త జయశంకర్, చింతం అమర్‌వర్మ, వీరబత్తిని శ్యాంసుందర్, వడ్డే శ్రీనివాస్, రుద్ర శ్రీనివాస్, దీపక్ వరియల్, మేకల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే యూజీసీ పే స్కేళ్లు అమలు చేయాలి

అక్షరశక్తి, వరంగల్: తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,230 మంది కాంట్రాక్టు అధ్యాపకులను అబ్జర్బ్ చేసిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాల్లో ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ముందుగా అబ్జర్బ్ చేసి, వారికి తక్షణమే యూజీసీ పే స్కేళ్లు అమలు చేయాలని కోరారు. రాజస్థాన్ రాష్ట్రంలో తాత్కాలిక విశ్వవిద్యాలయ అధ్యాపకులను అబ్జర్బ్ చేసేందుకు చట్ట పరమైన చర్యలు తీసుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సైతం కాంట్రాక్టు అధ్యాపకులను అబ్జర్బ్ చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత అధ్యాపకుల సమస్యలను పరిష్కరించకుండా కొత్త నియామకాల నోటిఫికేషన్లు ఇవ్వడం సరికాదన్నారు. ఈ సమావేశంలో కాకతీయ విశ్వవిద్యాలయ కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ పుల్ల రమేష్, డాక్టర్ చందులాల్, డాక్టర్ శంకరయ్య, డాక్టర్ కవిత, డాక్టర్ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ ఫోకస్!

- **క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను కలవాలి**
- **డివిజన్ల వారీగా ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యుల నియామకం**
- **పట్టభద్రుల ఓట్ల నమోదును పకడ్బందీగా చేపట్టాలి**
- **మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్**



అక్షరశక్తి, హనుమకొండ: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి బోయినపల్లి వినోద్‌కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలని అన్నారు.

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను బీఆర్ఎస్ నియమించింది. ఈ సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని అలంకార్ కాకతీయ కాలనీలో వినోద్‌కుమార్ నివాసంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత, ఓటరు నమోదు, పార్టీ శ్రేణుల కార్యాచరణపై చర్చించారు.

డివిజన్ల వారీగా బాధ్యతలు

పట్టభద్రుల ఓటరు నమోదులో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వినోద్‌కుమార్ సూచించారు. అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి, వారు ఓటర్లుగా నమోదు చేసుకునేలా సహకరించాలన్నారు. డివిజన్ల వారీగా ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులను నియమించి, నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా వ్యవహరించి పట్టభద్రుల మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు.

పశ్చిమ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అత్యధిక పట్టభద్రుల ఓట్లు నమోదయ్యేలా ఇప్పటికే డివిజన్ల వారీగా ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పట్టభద్రులను కలుస్తూ నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు నమోదయ్యేలా పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. కేసీఆర్ పాలనను ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని, పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాన్ని సాధిస్తుందని వినయ్‌భాస్కర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అక్టోబరు 25న కీలక సమావేశం

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా అక్టోబరు 25న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఎల్వోలు, ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తలు, బాధ్యులు, సోషల్ మీడియా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేయడం సమావేశం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ చైర్మన్ డాక్టర్ కే. వాసుదేవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- **రత్నగిరి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్**
- **విద్యార్థులతో గణిత ప్రశ్నలు.. తాగునీరు, పెయింటింగ్‌పై ఆదేశాలు**



అక్షరశక్తి, భీమదేవరపల్లి, అక్టోబరు 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు.

ముందుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో మాట్లాడి వారు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న గణిత పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేశారు. ఐదో తరగతి విద్యార్థిని ఆర్ష్యా తబస్సుమ్‌తో పాటు ఇతర విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. ఎఫ్ఎల్ఎన్ పుస్తకాలు అందాయా అని ఆరా తీశారు. స్కేల్‌తో కొలతలు ఎలా చేయాలో విద్యార్థులను అడగగా, ఓ విద్యార్థిని తన అరచేతిని కొలిచి చూపించింది. ఒకటి, రెండు, మూడు తరగతుల గదులను సందర్శించి చిన్నారులతో రైమ్స్ చెప్పించారు. టై, బెల్టులు అందాయా, మధ్యాహ్న భోజనం ఎలా ఉంటోందని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీరు నాణ్యంగా ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. భవనానికి పెయింటింగ్ వేయించాలని, మెరుగైన వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు.

గ్రామపంచాయతీ పనులపై ఆరా

గ్రామపంచాయతీ కార్యాలయంలో బ్లీచింగ్ పౌడర్ నిల్వ, మరుగుదొడ్ల సదుపాయాలపై పంచాయతీ కార్యదర్శి సుజాతను ప్రశ్నించారు. గ్రామానికి ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి, ఎంతమంది లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేశారు, ఇంకా ఎంతమంది అర్హులకు ఇళ్లు అవసరమనే వివరాలను సర్పంచ్ తిరుమల, పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సర్పంచ్ తిరుమల, నాయబ్ తహసీల్దార్ సూర్య, మండల వ్యవసాయ అధికారి పద్మ, ఏఈఈ లక్ష్మణ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కలకలం...

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ.. ○ భూముల మ్యుటేషన్‌కు యత్నం..


అక్షరశక్తి, వరంగల్: ఖిలా వరంగల్ మండలంలో నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వ్యవహారం తాజాగా వెలుగుచూసింది. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతోపాటు ప్రభుత్వ కార్యాలయ సీలును దుర్వినియోగం చేసి నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి.

రికార్డుల పరిశీలనతో వెలుగులోకి..

ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం మెహరున్నిసా బేగం పేరిట 2026 జనవరి 8న జారీ చేసినట్లు పేర్కొంటూ C/3223/2026 డి.డిస్ నంబర్‌తో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రూపొందించారు. ఈ పత్రం నిజమైనదో కాదో పరిశీలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల తహసీల్దార్ కోరడంతో ఖిలా వరంగల్ కార్యాలయ అధికారులు రికార్డులను తనిఖీ చేశారు. అయితే, సంబంధిత నంబరుతో ఎలాంటి సర్టిఫికెట్ జారీ చేయలేదని కార్యాలయ రికార్డులు, డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్ పరిశీలనలో తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి సంబంధించిన అసలు సభ్యులందరి వివరాలను పొందుపరచకుండా నకిలీ పత్రాన్ని సృష్టించి, వ్యవసాయ భూముల మ్యుటేషన్‌కు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. తహసీల్దార్ సంతకం ఫోర్జరీతోపాటు ప్రభుత్వ కార్యాలయ సీలును ఉపయోగించిన అంశాలపై విచారణ జరపాలని కోరారు.

నలుగురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్ తహసీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఫిర్యాదు మేరకు ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో అక్టోబర్ 17న ఎఫ్ఐఆర్ నంబర్ 780/2026 నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 318(4), 336(3), 340(2), 337 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరాత్రి మహేశ్ దర్యాప్తు చేపట్టారు.



GUEST COLUMN

ఐఏఎస్ కాబోయి ఆల్ ఇండియా రేడియోలోకి!

నిహార కానేటి ప్రయాణం: ప్రజాసేవకు మరో చిరునామా



ఆఫీస్ లో నిహార. కానేటి అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి హైద్రాబాద్



ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీ కీరవాణి తో ఇంటర్వ్యూ

ప్రజాసేవకు మార్గాలు అనేకం. వాటిలో కొన్ని అధికార పీఠాల వైపు నడిపిస్తే, మరికొన్ని ప్రజల హృదయాల్లోకి చేరుస్తాయి. కొన్ని రాజ్యపాలనలో భాగమై సమాజాన్ని ప్రభావితం చేస్తే, మరికొన్ని అక్షరాల ద్వారా, కళల ద్వారా, సంగీతం ద్వారా, ప్రజల గొంతుకలకు వేదిక కల్పించడం ద్వారా సామాజిక చైతన్యానికి దోహదపడతాయి. ఐఏఎస్ కావాలని కలలు కన్న నిహార కానేటి ప్రయాణం ఈ రెండో కోవకు చెందిన విశిష్టమైన ఉదాహరణ. భారత ప్రభుత్వ పరిపాలనా సేవల్లో చేరాలనే ఆకాంక్షతో ప్రారంభమైన ఆమె ప్రస్థానం, చివరకు ఆకాశవాణి ద్వారా ప్రజలకు సేవ చేసే అర్థవంతమైన జీవితంగా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం ఆకాశవాణి హైదరాబాద్‌లో సహాయ సంచాలకురాలు (కార్యక్రమాలు)గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె జీవనప్రయాణం, ప్రజాసేవకు ఒకే ఒక్క మార్గం ఉండదని, నిజమైన సేవకు పదవికంటే ప్రయోజనం, అధికారానికంటే అంకితభావం ముఖ్యమని నిరూపిస్తోంది.

కుటుంబ నేపథ్యం.. వ్యక్తిత్వ వికాసం

1987 ఫిబ్రవరి 13న జన్మించిన నిహార, మహబూబాబాద్, వరంగల్ ప్రాంతాల్లో పెరిగారు. స్వతంత్రంగా ఆలోచించే స్వేచ్ఛను, తమ సామర్థ్యాలపై విశ్వాసాన్ని కుటుంబం ఆమెకు అందించింది. ఒక వ్యక్తి వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడంలో కుటుంబ వాతావరణం, తల్లిదండ్రుల ఆలోచనా విధానం, వారు అందించే ప్రోత్సాహం ఎంత కీలకమైనవో ఆమె జీవితం తెలియజేస్తుంది.

ఆమె తండ్రి డాక్టర్ కె.ఎల్.వి. ప్రసాద్ దిండి గ్రామానికి చెందినవారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఈ గ్రామం నుంచి వచ్చిన ఆయన, దంత వైద్య విభాగంలో సివిల్ సర్జన్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. కమ్యూనిస్టు భావజాల ప్రభావం ఉన్న కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన ఆలోచనలు, జీవితంలో ఎదుర్కొన్న పోరాటాలు, సాధించిన విజయాలు నిహారపై చెరగని ముద్ర వేశాయి. సమాజాన్ని పరిశీలించే దృష్టి, వ్యక్తుల జీవితాల వెనుక ఉన్న సామాజిక వాస్తవాలను అర్థం చేసుకునే ఆసక్తి ఆమె ఆలోచనా ప్రపంచాన్ని ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. ప్రజల సమస్యలు, వారి జీవనవిధానాలు, సాంస్కృతిక వైవిధ్యం పట్ల ఆమె చూపుతున్న ఆసక్తిని ఈ నేపథ్యంతో అనుసంధానించి చూడవచ్చు.

ఆమె తల్లి శ్రీమతి అరుణకుమారి కానేటి భారతీయ స్టేట్ బ్యాంక్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. వృత్తిపరమైన బాధ్యతలతో కూడిన జీవనానుభవం, కుటుంబానికి అందించిన తోడ్పాటు నిహార ఎదుగుదలలో భాగమయ్యాయి. ఆమె సోదరుడు రాహుల్ కానేటి థర్మోడైనమిక్స్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టా పొంది, అమెరికాలోని మెడ్‌ట్రానిక్ సంస్థలో పనిచేస్తున్నారు.

2013 డిసెంబర్ 19న సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వినోద్ కుమార్ జోషిని నిహార వివాహం చేసుకున్నారు. వారికి ఆంశీ, నివిన్ ఆయాన్స్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన విజయాలకు, వృత్తిపరమైన ఎదుగుదలకు పుట్టింటి కుటుంబం, ప్రస్తుతం తనతో జీవితం పంచుకుంటున్న కుటుంబం అందించిన మద్దతు కీలకమని ఆమె పేర్కొంటారు. స్వతంత్రంగా ఆలోచించేందుకు అవకాశం కల్పించడం, ప్రతిభపై విశ్వాసం ఉంచడం, ఆశయాల సాధనకు ప్రోత్సహించడం వంటి అంశాలు ఆమె ప్రయాణానికి బలమైన పునాదులుగా నిలిచాయి.

విద్యాభ్యాసం నుంచి వృత్తిపరమైన నైపుణ్యం వరకు

నిహార హనుమకొండలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేశారు. అనంతరం సెయింట్ ఆన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో మైక్రోబయాలజీ, జెనెటిక్స్ విభాగాల్లో డిగ్రీ చదివారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఎం.ఎన్.ఆర్. పీజీ కాలేజీలో హ్యూమన్ జెనెటిక్స్‌లో ఎం.ఎస్‌సీ. పట్టా పొందారు. ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నుంచి క్రియేటివ్ రైటింగ్‌లో డిప్లొమా కూడా పూర్తిచేశారు. టెలివిజన్, రేడియో కార్యక్రమాల నిర్మాణానికి సంబంధించిన పరిచయ శిక్షణను భువనేశ్వర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ మల్టీమీడియా సంస్థలో పొందారు. ఈ శిక్షణలో రెండో స్థానం సాధించడం విశేషం. శాస్త్రీయ విద్య, సృజనాత్మక రచన, ప్రసార మాధ్యమాలపై శిక్షణ.. ఈ మూడు విభిన్న రంగాల అనుభవం ఆమె వృత్తి జీవితానికి అవసరమైన బహుముఖ దృష్టిని అందించాయి.

పాఠశాల రోజుల్లో తాను సగటు విద్యార్థినేనని, పుస్తక పఠనంలోని ఆనందాన్ని కూడా కొంత ఆలస్యంగానే కనుగొన్నానని ఆమె స్వయంగా పేర్కొనడం ఆసక్తికరం. ప్రతిభ అనేది చిన్నతనం నుంచే ఒకే రకంగా వ్యక్తమవ్వాలని లేదు. సరైన సందర్భం, ఆసక్తి, అనుభవం లభించినప్పుడు మనలోని సామర్థ్యాలు కొత్త రూపాల్లో వికసించవచ్చనే విషయాన్ని ఆమె ప్రయాణం గుర్తుచేస్తుంది.

ఆశయం నుంచి అనుభవం వరకు

భారతదేశంలో ఐఏఎస్ కావడం ఎంతోమంది యువతీ యువకుల జీవితాశయం. సమాజంలో మార్పు తీసుకురావాలనే తపన, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం, ఉన్నతమైన బాధ్యతలు నిర్వహించాలనే ఆకాంక్ష వారిని సివిల్ సర్వీసుల వైపు నడిపిస్తాయి. నిహార కానేటి కూడా ఒకప్పుడు అదే బాటలో పయనించారు. అయితే, జీవితంలో మనం ఎంచుకున్న మార్గమే మన గమ్యమని చెప్పలేం. కొన్నిసార్లు అనుభవాలు కొత్త అవకాశాలను పరిచయం చేస్తాయి. మనలోని ప్రతిభకు మరో వేదికను చూపిస్తాయి. నిహార జీవితంలో రేడియో అలాంటి ప్రత్యామ్నాయ ప్రపంచానికి ద్వారమైంది.

సివిల్ సర్వీసుల కోసం సిద్ధమవుతున్న సమయంలోనే ఆమె రేడియో రంగంలోకి ప్రవేశించారు. రైన్‌బో ఎఫ్‌ఎంలో ఫ్రీలాన్స్ రేడియో జాకీగా పనిచేయడం మొదట ఆమెకు ఒక వృత్తిపరమైన అవకాశంగా కనిపించినా, క్రమంగా అది జీవితానికి కొత్త దిశను చూపించింది. ఎనిమిదేళ్లపాటు ఫ్రీలాన్స్ రేడియో జాకీగా పనిచేసిన ఆమె, అనంతరం ఒక సంవత్సరం యువవాణి ఇంగ్లిష్ కార్యక్రమాలతో అనుబంధం ఏర్పరచుకున్నారు.

ఈ అనుభవాలు ఆమెకు కేవలం మైక్రోఫోన్ ముందు మాట్లాడే నైపుణ్యాన్నే కాకుండా, శ్రోతల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం, విషయాన్ని ఆసక్తికరంగా అందించడం, మాటల ద్వారా వ్యక్తులతో అనుబంధాన్ని పెంపొందించడం వంటి విలువైన పాఠాలను నేర్పాయి. రేడియో అనేది శబ్దాలను ప్రసారం చేసే సాధనం మాత్రమే కాదు; కనిపించని శ్రోతతో కనిపించని అనుబంధాన్ని నిర్మించే కళ కూడా. ఆ కళలో ఆమెకు క్రమంగా నైపుణ్యం పెరిగింది.

మే 2015లో నిజామాబాద్ ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వాహకురాలిగా ఆమె ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. ఆగస్టు 2016లో వరంగల్‌కు బదిలీ అయ్యారు. 2021లో హైదరాబాద్‌లో వివిధ భారతి తెలుగు



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

ప్రసారాల పునర్వ్యవస్థీకరణ అనంతరం వాటిని స్థిరీకరించే బాధ్యతల్లోనూ పనిచేశారు. సెప్టెంబర్ 2022 నుంచి ఆకాశవాణి హైదరాబాద్‌లో తన సేవలను కొనసాగిస్తున్నారు. వివిధ కేంద్రాల్లో పనిచేసిన అనుభవం ఆమెకు ప్రాంతీయ సంస్కృతులు, భాషలు, ప్రజల జీవనవిధానాలు, ప్రసార కార్యక్రమాల నిర్వహణపై విస్తృతమైన అవగాహనను అందించింది. ఒక్కసారిగా ఉన్నత స్థానానికి చేరుకోవడం కంటే, ప్రతి దశలో అనుభవాన్ని సంపాదించుకుంటూ బాధ్యతలను విస్తరించుకోవడం ఆమె వృత్తి ప్రయాణంలోని ప్రత్యేకత.

మరుగునపడుతున్న జానపద సంపదకు జీవం:

నిహార కానేటి కృషిలో అత్యంత ప్రశంసనీయమైన అంశం భారతీయ జానపద సంపద పరిరక్షణ. ఒక సమాజపు చరిత్ర పుస్తకాలలోనే ఉండదు. తరతరాలుగా ప్రజల నోట వినిపించే పాటల్లోనూ ఉంటుంది. పండుగల పాటల్లో వారి ఆనందం, వ్యవసాయ గీతాల్లో వారి శ్రమ, పెళ్లి పాటల్లో వారి సంప్రదాయాలు, ఆచార సంబంధమైన గీతాల్లో వారి సామాజిక జీవనం ప్రతిఫలిస్తాయి. అటువంటి మౌఖిక సంపదకు లిఖితపూర్వకమైన, శాస్త్రీయమైన రికార్డు లేకపోతే, ఒక తరం తర్వాత అవి మరుగునపడిపోయే ప్రమాదం ఉంది.

నిజామాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో చేపట్టిన 'సంస్కార్ గీత్' ప్రాజెక్టు రెండో సీజన్‌కు ఆమె నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బంజారా భాషలో 200కు పైగా పాటలను సేకరించారు. పండుగలు, వ్యవసాయం, జననం, వివాహం, యుక్తవయస్సు, గాజుల వేడుక వంటి వివిధ సందర్భాలకు సంబంధించిన గీతాలను నమోదు చేశారు. వాటితోపాటు పాటల సారాంశాలు, హిందీ, ఇంగ్లిష్ అనువాదాలు, సంగీత స్వరలిపులను (మ్యూజికల్ నొటేషన్స్) సిద్ధం చేసి ఆకాశవాణి డైరెక్టరేట్‌కు అందించారు. వరంగల్‌లో ఈ ప్రాజెక్టు మూడు, నాలుగు సీజన్ల బాధ్యతలు నిర్వహిస్తూ తెలుగు, బంజారా, గుత్తి కోయ భాషల్లో దాదాపు 500 పాటలను సేకరించారు. జననం నుంచి మరణం వరకు మానవ జీవితంలోని వివిధ ముఖ్య దశలను ప్రతిబింబించే గేయాలతోపాటు, స్థానిక దేవతల కథలను వినిపించే వీరగాథలను కూడా ఈ కృషిలో భాగంగా నమోదు చేశారు. ఈ పాటలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డులు, అనువాదాలు, సంగీత స్వరలిపులను (మ్యూజికల్ నొటేషన్స్) భద్రపరిచి ఆకాశవాణి డైరెక్టరేట్‌కు పంపించారు. ఇది కేవలం పాటల సేకరణ కాదు; సమాజపు సాంస్కృతిక జ్ఞాపకాలను భవిష్యత్తు తరాలకు అందించే మహత్తర ప్రయత్నం. ఒక పాటను రికార్డు చేయడం దాని స్వరాన్ని భద్రపరుస్తుంది. దానిని



తల్లిదండ్రులతో. శ్రీమతి నిహార.కానేటి

అనువదించడం ఇతర భాషల ప్రజలకు పరిచయం చేస్తుంది. స్వరలిపిని సిద్ధం చేయడం దాని సంగీత నిర్మాణాన్ని కాపాడుతుంది. నేపథ్యాన్ని నమోదు చేయడం దాని సామాజిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని నిలబెడుతుంది. ఈ అంశాలన్నింటినీ సమన్వయం చేసిన నిహార కృషి, పరిశోధకులకు, సంగీతాభిమానులకు, భవిష్యత్తు తరాలకు విలువైన సాంస్కృతిక ఆధారాలను అందిస్తుంది.

డిజిటల్ యుగంలో ప్రపంచమంతా ఒకే రకమైన వినోదపు ధోరణులకు ఆకర్షితమవుతున్న వేళ, చిన్న భాషల ప్రత్యేకతను, గిరిజన సమాజాల సృజనాత్మకతను కాపాడటం మరింత అవసరం. బంజారా, గుత్తి కోయ వంటి సమూహాల సాంస్కృతిక వ్యక్తీకరణలకు తగిన గుర్తింపు కల్పించడం ద్వారా ఆమె భారతీయ సంస్కృతిలోని వైవిధ్యాన్ని పరిరక్షించే ప్రయత్నం చేశారు. నిజానికి, నాగరికత గొప్పదనం దాని ఆధునిక సాంకేతికతలోనే కాదు; తన మూలాలను ఎంత జాగ్రత్తగా కాపాడుకుంటుందన్న దానిలోనూ ఉంటుంది.

సంప్రదాయానికి ఆధునికతను జోడిస్తూ:

గతాన్ని భద్రపరచడమే కాదు, వర్తమానాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తుకు మార్గం వేయడం కూడా నిహార వృత్తి దృక్పథంలో భాగం. హైదరాబాద్ ఆకాశవాణిలో వ్యవసాయ, గృహ కార్యక్రమాలు, మహిళలు, పిల్లలకు సంబంధించిన ప్రసారాలు, ఆరోగ్యం, సంగీతం, జానపద సంగీతం, వివిధ భారతి, కార్యక్రమాల సమన్వయం వంటి విభిన్న విభాగాల్లో ఆమె బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమాల సమయ పట్టికల రూపకల్పన (ప్రోగ్రాం టైం షెడ్యూల్స్), ప్రసారాల క్రమబద్ధీకరణ, శ్రోతల అవసరాలకు అనుగుణంగా విషయాల ఎంపిక వంటి అంశాల్లో ఆమె పాత్ర కీలకమైనది.



నోబుల్ లారేట్ కైలాష్ సత్యార్థి తో ఇంటర్వ్యూ

వివిధ భారతి తెలుగు ప్రసారాల పునర్వ్యవస్థీకరణ అనంతరం కొత్త కార్యక్రమాల రూపకల్పనకు ఆమె ప్రాధాన్యమిచ్చారు. యువతను ఆకర్షించడంతోపాటు, చాలాకాలంగా ఆకాశవాణిని ఆదరిస్తున్న శ్రోతల అనుబంధాన్ని నిలబెట్టుకోవడం కూడా ఆమె ముందున్న సవాలు.

ప్రైవేటు ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలు విస్తరిస్తున్న కాలంలో ప్రజా ప్రసార సంస్థలు తమ ప్రాసంగికతను నిరూపించుకోవాలి. అయితే, వాటి విజయాన్ని వినోదం లేదా వాణిజ్య లాభాలతో మాత్రమే కొలవలేం. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, ప్రాంతీయ భాషలు, ప్రజలకు ఉపయోగపడే సమాచారం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం వాటి ప్రత్యేక బాధ్యత. మార్కెట్ పోటీని ఎదుర్కొంటూనే ప్రజాప్రయోజనాలను విస్మరించకపోవడం అసలైన పరీక్ష. రేడియోను రాబోయే తరాలకు కూడా ప్రాసంగికంగా, ఆర్థికంగా నిలదొక్కుకునే మాధ్యమంగా తీర్చిదిద్దాలన్న ఆమె సంకల్పం ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంటుంది. సంప్రదాయాన్ని కాపాడటం అంటే మార్పును తిరస్కరించడం కాదు; మార్పును స్వీకరిస్తూనే మూల విలువలను నిలబెట్టుకోవడం. నిహార కృషిలో కనిపించే ఈ సమతూకం ప్రజా ప్రసార సంస్థల భవిష్యత్తుకు అవసరమైన దృక్పథం.

స్టూడియోను దాటి సమాజంతో అనుబంధం:

మహిళల హాకీ ప్రపంచకప్ అర్హత పోటీలకు ద్విభాషా వ్యాఖ్యానం చేయడం, విద్య, అంతరిక్ష పరిశోధన, నూతన వ్యాపారాలు, ఆరోగ్యం, సంగీతం, విజ్ఞానశాస్త్రం, సాహిత్యం, సినిమా రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వ్యక్తులను ఇంటర్వ్యూ చేయడం ఆమె అనుభవాల విస్తృతిని తెలియజేస్తాయి. నోబెల్ పురస్కార గ్రహీత కైలాష్ సత్యార్థితో , ప్రముఖ చలనచిత్ర సంగీత దర్శకులు, ఆస్కార్ అవార్డు గ్రహీత కోడూరి మరకత మణి కీరవాణి (ఎం. ఎం.కీరవాణి)వంటి ప్రపంచ ప్రఖ్యాత ప్రముఖుల ఇంటర్వ్యూలు కూడా ఈ కార్యక్రమాల్లో ఉన్నాయి. యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు, చర్చావేదికలు, ప్రేక్షకుల భాగస్వామ్యంతో జరిగే ప్రసారాలు, ఆకాశవాణి 90 సంవత్సరాల ప్రస్థానాన్ని గుర్తుచేసే కార్యక్రమాలు ఆమె ప్రజాసంబంధాల పరిధిని మరింత విస్తరించాయి.

విద్యాసంస్థలతో ఆమెకు ఉన్న అనుబంధం మరో విశేషం. తెలంగాణ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఈఎఫ్ఎల్‌యూ)ల్లో ప్రజా ప్రసార మాధ్యమాల భవిష్యత్తు, డిజిటల్ యుగంలో వాటి బాధ్యతలు, బాలికల విద్య ప్రాధాన్యం వంటి అంశాలపై ఉపన్యాసాలు ఇచ్చారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో మహిళా అధ్యయనాల విభాగంతో కలిసి 'ఎంపవర్' పేరిట సదస్సును నిర్వహించారు. ప్రసార మాధ్యమాలు,' మహిళా సాధికారత', మహిళా పారిశ్రామికవేత్తల గురించి ఆమె చేసిన రచనలు కూడా ఈ అంశాలపై ఆమెకున్న నిబద్ధతను తెలియజేస్తాయి. శాస్త్రీయ విద్యతోపాటు సృజనాత్మక రచనలోనూ శిక్షణ పొందిన ఆమె, ప్రసార మాధ్యమాలను కేవలం సాంకేతిక ప్రక్రియగా కాకుండా, జ్ఞానాన్ని ప్రజలకు చేరవేసే సామాజిక సాధనంగా చూస్తున్నారు. విద్యాసంస్థల్లో ఉపన్యాసాలు ఇవ్వడం, విద్యార్థులతో సంభాషించడం, ప్రజా ప్రసారాల ప్రాధాన్యాన్ని వివరించడం ద్వారా తన వృత్తి అనుభవాన్ని విస్తృత సమాజంతో పంచుకుంటున్నారు.

ఈ కార్యక్రమాలన్నీ ఆమెకు ప్రసారం అంటే కేవలం సమాచారాన్ని ఒకచోటు నుంచి మరోచోటుకు పంపించడం కాదని స్పష్టం చేస్తున్నాయి. ప్రజలను ఆలోచింపజేయడం, కొత్త విషయాలను పరిచయం చేయడం, విభిన్న వర్గాల మధ్య సంభాషణకు అవకాశం కల్పించడం, సామాజిక సమస్యలపై అవగాహన పెంపొందించడం కూడా ప్రసార మాధ్యమాల బాధ్యతలేనని ఆమె కార్యాచరణ చాటుతోంది.

పదవికి మించిన ప్రజాసేవ:

ఐఏఎస్ కావాలనే ఆశయంతో ప్రారంభమైన నిహార కానేటి ప్రస్థానం ఆకాశవాణిలో కొత్త అర్థాన్ని సంతరించుకుంది. పరిపాలనా సేవల్లో ఉన్నవారు ప్రభుత్వ విధానాల అమలు ద్వారా ప్రజల జీవితాలను ప్రభావితం చేయగలిగితే, ప్రజా ప్రసార మాధ్యమాల్లో పనిచేసేవారు జ్ఞానాన్ని విస్తరించడం, సంస్కృతిని కాపాడటం, ప్రజల గొంతుకలకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా సమాజానికి సేవ చేయగలరు. ఈ రెండు మార్గాలూ పరస్పర విరుద్ధమైనవి కావు; ప్రజాప్రయోజనమే వాటి ఏకైక అంతిమ లక్ష్యం.

అయితే, ఇలాంటి కృషి వ్యక్తిగత ప్రతిభతోనే పూర్తికాదు. సాంస్కృతిక డాక్యుమెంటేషన్‌కు తగిన నిధులు, సాంకేతిక సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది అవసరం. ప్రజా ప్రసార సంస్థలు కాలానుగుణంగా మారుతూ, తమ స్వతంత్రతను, విశ్వసనీయతను, ప్రజలతో అనుబంధాన్ని కాపాడుకోవాలి. నిహార వంటి యువ వృత్తినిపుణుల కృషికి గుర్తింపు ఇవ్వడం అంటే, వారిని ప్రోత్సహించడంతోపాటు వారు పనిచేసే సంస్థలను బలోపేతం చేయడం కూడా. ఐఏఎస్ కావాలనే కల నెరవేరకపోవడం ఒక అపజయంగా భావించాల్సిన అవసరం లేదు. ఆ కల వెనుక ఉన్న ప్రజాసేవ ఆకాంక్ష మరో రూపంలో సాకారమైతే, అది కూడా విజయమే. బంజారా, గుత్తి కోయ పాటల్లోని సాంస్కృతిక జ్ఞాపకాలను భద్రపరచడం, యువతను ప్రసార మాధ్యమాల వైపు ప్రోత్సహించడం, తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన ఆకాశవాణిని ఆధునిక శ్రోతలకు చేరువ చేయడం ద్వారా నిహార కానేటి తనదైన సేవామార్గాన్ని నిర్మించుకున్నారు.

ఈ ప్రయాణంలో ఆమె కుటుంబం అందించిన విశ్వాసం, ప్రోత్సాహం కూడా అంతర్లీనంగా కనిపిస్తాయి. తల్లిదండ్రుల నుంచి పొందిన విలువలు, తన సామర్థ్యాలపై కుటుంబం ఉంచిన నమ్మకం, జీవిత భాగస్వామి సహకారం ఆమె వృత్తిపరమైన ఆశయాలకు అండగా నిలిచాయి. వ్యక్తిగత విజయాన్ని కుటుంబ మద్దతు నుంచి వేరు చేసి చూడలేమనే వాస్తవాన్ని ఆమె అనుభవం గుర్తుచేస్తుంది. పరిపాలనా సేవలు వర్తమానాన్ని తీర్చిదిద్దితే, సాంస్కృతిక పరిరక్షణ గతాన్ని భవిష్యత్తుతో అనుసంధానిస్తుంది. ప్రజా ప్రసార మాధ్యమాలు ఈ రెండింటి మధ్య వారధిగా నిలుస్తాయి. ఆ వారధిని మరింత బలపరచడంలో తన వంతు పాత్ర పోషిస్తున్న నిహార ప్రయాణం మనకు చెప్పే సందేశం ఒక్కటే... ప్రజాసేవకు చిరునామా పదవి కాదు, ప్రజల పట్ల మనకున్న బాధ్యత. అధికారం ఒక మార్గమైతే, సంస్కృతిని కాపాడటం, జ్ఞానాన్ని పంచడం, ప్రజల గొంతుకలను వినిపించడం మరో మార్గం. ఆ మార్గంలో నిబద్ధతతో సాగిన నిహార ప్రతి అడుగూ సమాజానికి విలువైన సంపదే.నిహార వృత్తి జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, కుటుంబ జీవితంలో కూడా సుఖశాంతులతో, సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీస్సులతో...

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.